## క్లుప్తంగా

### ముమ్మరంగా వరి నూర్పిళ్లు


వరినూర్పిళ్లలో గిరిజన రైతులు

**హుకుంపేట:** మండలంలోని ముమ్మరంగా వరి కోతలతో పాటు నూర్పిళ్లు వడివడిగా సాగుతున్నాయి. ఈ నెల 27వ తేది నుంచి తుపాను ప్రభావం ఉన్నట్టు సమాచారం మేరకు గిరిజనులు వరి కోతలు, నూర్పిళ్ల పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలించడంతో వరి పంట ఆశాజనకంగా ఉందని పలువురు రైతులు చెబుతున్నారు. వర్షం పడితే పంట నష్టం వాటిల్ల కూడదని భయంతో రైతుల కుటుంబ సమేతంగా వడివడిగా కోతలు కోస్తు, వరి నూర్పిళ్ల పనులు చేపడుతున్నారు.

### అపార్ నమోదు వేగవంతం చేయాలి


కేజీబీవీ ఎస్‌వో పరిమళతో మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రసాద్

**కొయ్యూరు:** అపార్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంపీడీవో ప్రసాద్ సూచించారు. కేజీబీవీ, ఆశ్రమ బాలికల పాఠశాలలను ఆయన గురువారం సందర్శించారు. కేజీబీవీ ఎస్‌వో పరిమళ, బాలికల పాఠశాల హెచ్‌ఎం గోపాల్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల వివరాలను త్వరితగతిన సేకరించి, అపార్ నమోదును పూర్తి చేయాలన్నారు. ప్రాముఖ్యతను ఆయన వివరించారు. ఎం.మాకవరం, కొండగోకిరి పంచాయతీలను సందర్శించారు. గ్రామ సచివాలయ సిబ్బందికి పలు సూచనలిచ్చారు. విధుల నిర్వహణలో జాప్యం చేస్తే చర్యలు ఉంటాయన్నారు.నిబంధనలను అనుసరించి ప్రతీ ఒక్కరు విధులు నిర్వహించాలని సూచించారు.

### విస్తృతంగా వాహన తనిఖీలు


వాహనాల తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ రామకృష్ణ, సిబ్బంది

**వై.రామవరం:** వై.రామవరం బస్టాండు ఆవరణలో గురువారం రాత్రి ఎస్‌ఐ బి.రామకృష్ణ ఆధ్వర్యంలో విస్తృతంగా పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. సరిహద్దు ప్రాంతం నుంచి గంజాయి అక్రమ రవాణా అవుతుందన్న సమాచారం మేరకు ప్రధాన రహదారిలో రాకపోకలు సాగించే వాహనాలను, సామగ్రిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహన రికార్డులు, డ్రైవింగు లైసెన్స్‌లు పరిశీలించి, రికార్డులు సక్రమంగా లేని వాహనచోదకులపై కేసులు నమోదు చేసి, జరిమానాలు విధించారు. స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

### తాగునీటి సమస్య లేకుండా చర్యలు


మజ్జిగూడలో బోరు పనులు ప్రారంభిస్తున్న ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, నేతలు

**ముంచంగిపుట్టు:** మండలంలో గల ఏనుగురాయి పంచాయతీ మజ్జిగూడ గ్రామంలో గురువారం జల్ జీవన్ మిషన్ ద్వారా బోరు నిర్మాణ పనులకు ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, నేతలు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాగునీటి సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక దృష్టి సారించామన్నారు. పంచాయతీలోని గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వార్డు మెంబర్, వైఎస్సార్‌సీ నేతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# షెడ్డులోనే పాఠాలు.. ఇంకెన్నాళ్లీ పాట్లు?

- ఇరుకైన శిథిల గదిలో పాఠశాల
- విద్యార్థుల అవస్థలు
- జిల్లా కలెక్టర్ సందర్శించినా తీరని సమస్య
- భవనం మంజూరు చేయాలని గ్రామస్తుల మొర

**ముంచంగిపుట్టు:** పాఠశాలకు పక్కా భవనం లేక వంటషెడ్డునే పాఠశాల నిర్వహణకు వినియోగించాల్సిన పరిస్థితి నెలకొంది. ఎండకు, వానకు అవస్థలు పడుతూ గిరిజన విద్యార్థులు చదువుకోవాల్సిన దుస్థితి. ఇరుకైన శిథిల గదిలో తరగతులు కొనసాగుతున్నాయి. మన్యంలో విద్యా వ్యవస్థ మరుగున పడుతున్న కూటమి ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విద్యకు పెద్దపీట వేశారు. విద్యా వ్యవస్థ మెరుగునకు కోట్లాది రూపాయలు వెచ్చించారు. ఈ నేపథ్యంలో మన్యంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం లక్షలాది రూపాయలు మంజూరు. ఇందులో భాగంగా కొన్ని చోట్ల పనులు జరిగాయి. మరికొన్ని ప్రాంతాల్లో ఎన్నికల కారణంగా నిలిచిపోయాయి. అయితే రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరిస్తోంది. అధికారం చేపట్టి ఐదు నెలలు కావస్తున్నా నేటి వరకు ఎన్నికల హామీ ఏ ఒక్కటీ అమలుచేయలేదు. దీంతో పాటు విద్యా వ్యవస్థను పూర్తిగా విస్మరించింది. మన్యంలో ఒక్క ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కోసం కనీసం దృష్టి సారించ లేదు. దీంతో విద్యార్థులు సమస్యలతో సహవాసం చేస్తూ చదువులు కొనసాగిస్తున్నారు.


వంటషెడ్డు ఆరుబయట పాఠాల బోధన


దిగువకుమడ పాఠశాలను సందర్శించిన కలెక్టర్ దినేష్‌కుమార్ (ఫైల్)

**సమస్యలతో విద్యార్థుల సహవాసం**

మండలంలో గల కుమడ పంచాయతీ దిగువకుమడ గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు భవనం లేకపోవడంతో విద్యార్థులు వంట షెడ్డులో తరగతులు నిర్వహిస్తున్నారు. ఇరుకైన శిథిలావస్థకు చేరిన చిన్న గదిలోనే తరగతులు కొనసాగుతున్నాయి. శిథిలమైన షెడ్డు కావడంతో వర్షానికి కారిపోతూ ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతూ విద్యార్థులు చదువును కొనసాగిస్తున్నారు. గతంలో పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యాశాఖ అధికారులు కూల్చివేశారు. అప్పటి నుంచి విద్యార్థులకు భవన సమస్య వేధిస్తూ వస్తోంది. గత ఏడాది విద్యార్థుల తల్లిదండ్రులు ఏర్పాటుచేసుకున్న తాత్కాలిక పాకలోనే పాఠశాల నిర్వహణ సాగుతోంది. వర్షం పడితే షెడ్డు కారిపోతుండడంతో పాఠాల బోధన కష్టతరంగా మారుతుందని, నేల తడిసిపోతుండడంతో తమ పిల్లలు కూర్చునే పరిస్థితి లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీటలు వారిన గోడలు దర్శనమిస్తున్నాయని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నామన్నారు.

**ప్రతిపాదనలు పంపాం**

ఈ విషయంపై ఎంఈవో కృష్ణమూర్తి మాట్లాడుతూ పాఠశాల భవనం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామన్నారు. పక్కా భవనం కోసం ఎస్టిమేటెడ్ నిధులు, స్థల సేకరణ తదితర వివరాలను ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు.

### కలెక్టర్ హామీ నెరవేరేనా?

మండలంలోని దిగువకుమడ పాఠశాలను ఈ ఏడాది జూలై 3వ తేదిన అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ సైతం సందర్శించారు. పాఠశాల పాకలో నిర్వహించడంపై విచారణ వ్యక్తం చేశారు. నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కానీ నేటికి పాఠశాల భవనానికి నిధులు మంజూరు కాలేదు. ప్రస్తుతం పాఠశాల పాక సైతం ఇటీవల కురిసిన వర్షాలకు కూలిపోయింది. దీంతో పాఠశాల నిర్వహణ విద్యార్థులకు వంట చేసే గదినే వినియోగిస్తున్నారు. ఇరుకైన గదిలో 23 మంది విద్యార్థులు కూర్చొని పాఠాలు వినాల్సిన దయనీయ పరిస్థితి నెలకొంది. శిథిల షెడ్డు వల్ల ఏ ప్రమాదం ఎప్పుడు జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. తమ పిల్లలతో సమీప గ్రామ చిన్నారుల విద్యాభ్యాసం కోసం పాఠశాలకు పక్కా భవనం నిర్మించాలని ఈ విషయమై కలెక్టర్ దినేష్‌కుమార్‌ను గతంలో విన్నవించామని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, యంత్రాంగం స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

### ఇబ్బందులు తీర్చండి



పాఠశాలకు భవనం లేక చదువుకునేందుకు ఇబ్బందిగా ఉంది. వర్షం పడితే పాఠశాలకు వచ్చిన నేల పూర్తిగా తడిచిపోతోంది. కూర్చోలేకపోతున్నాం. అధికారులు మా పాఠశాలకు భవనం మంజూరు చేసి మా ఇబ్బందులు తీరుస్తారని దండం పెడుతున్నాం.

– పాంగి సావిత్రి, 2వ తరగతి, విద్యార్థిని, ముంచంగిపుట్టు మండలం

### అవస్థలు తొలగించాలి



వంటషెడ్డులో పాఠశాల నిర్వహణ జరుగుతుంది. జూలై నెలలో కలెక్టర్ దినేష్‌కుమార్ సందర్శించి, ఇక్కడి పాఠశాలను పరిశీలించారు. పాఠశాల పరిస్థితి చూసి, భవనం మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.వెంటనే భవనానికి నిధులు మంజూరు చేసి విద్యార్థులు అవస్థలు తొలగించాలి.

– సిద్ధేశ్వరరావు, దిగువకుమడ గ్రామస్తుడు

### గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరం


మాట్లాడుతున్న ఎస్‌ఐ రామకృష్ణ

**ముంచంగిపుట్టు:** మండల కేంద్రంలోని గిరిజన రైతులకు ఎస్‌ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో గంజాయి అనర్థాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమని, వాటికి దూరంగా ఉండాలన్నారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గంజాయి సాగు, రవాణా వల్ల కలిగే నష్టాలపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే గంజాయి సాగుపై డ్రోన్లుతో తెలుసుకోవడం జరిగిందని, గంజాయి సాగుపై గ్రామాల వారీగా సమాచారం పోలీసుశాఖ వద్ద ఉందని, సాగును రైతులు స్వచ్ఛందంగా ధ్వంసం చేసుకోవాలని లేని పక్షన గంజాయి పంటలపై పోలీసులు దాడులు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయికి బదులుగా వాణిజ్య పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు.

### మండల వీఆర్వోల నూతన కార్యవర్గ ఎన్నిక


ఎన్నికైన వీఆర్వోల సంఘ కార్యవర్గ సభ్యులు

**చింతపల్లి:** చింతపల్లి మండల వీర్వోల సంఘ నూతన కార్యవర్గ ఎన్నిక సంఘం డివిజన్ ఉపాధ్యక్షుడు టి.సోమలింగం ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయ ఆవరణలో గురువారం జరిగింది. కమిటీ అధ్యక్ష ,కార్యదర్శులుగా ఎస్.విష్ణు, నాగబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోశాధికారిగా పూర్ణచంద్రరావును, కార్యవర్గ సభ్యులుగా వెంకటరమణ,మానవతి, నాగమ్మ కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

## యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గ ఎన్నిక


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

**గంగవరం:** ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ గంగవరం మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక బుధవారం రాత్రి ఏకగ్రీవంగా జరిగింది. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి, ఎన్నికల అధికారిగా జి.తేజరావు వ్యవహరించారు. నూతన కమిటీ గౌరవ అధ్యక్షుడిగా కె.రఘుబాబు దొర, అధ్యక్షుడిగా చవలం రాంబాబు దొర, అసోసియేట్ అధ్యక్షుడిగా కారం బొజ్జిదొర, అసోసియేట్ మహిళా అధ్యక్షురాలుగా ఎల్.రుక్మిణి దేవి, ప్రధాన కార్యదర్శి సీహెచ్.వెంకటేశ్వరరావు, కోశాధికారిగా ఆర్.సత్య కిరణ్‌రెడ్డిను ఎన్నుకున్నారు. వీరితో పాటు మండల ఆడిటర్‌గా సీహెచ్.నాగేశ్వరరావు. మహిళా కమిటీ కన్వీనర్‌గా ఎస్.ఆర్.విజయలక్ష్మి, ఉమాదేవి , సునీతా కుమారి, దుర్గా భవాని, ఎస్.రాజేశ్వరి, ఉమా మాధురి, సీపీఎస్ కమిటీ కన్వీనర్‌గా కానెం రాంబాబు, జిల్లా కౌన్సిలర్‌గా ప్రసాద్ , కుంజం వెంకన్నదొర, పరదా విజయ కుమారి, కృష్ణ దొర , గంతా లలిత, టెక్నికల్ సెల్ కన్వీనర్‌గా కె.శ్రీనివాసరావు దొర, కె.దామోదర్ , మరో పది మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులచే ఎన్నికల అధికారి జి.తేజోరావు ప్రమాణ స్వీకారం చేయించారు.

## భక్తిశ్రద్ధలతో అంబలం పూజ


చింతపల్లిలో అంబలం పూజలో పాల్గొన్న భక్తులు

**చింతపల్లి:** స్థానిక రామాలయంలో అయ్యప్ప స్వామి అంబలం పూజ ఘనంగా నిర్వహించారు. కార్తీకమాసం పర్వదినాలను పురస్కరించుకొని మాదాబత్తుల సత్యనారాయణ(సత్తిబాబు)లక్ష్మి దంపతుల ఇంటి వద్ద బుధవారం రాత్రి గురుస్వాములు గంపరాయి విజయకుమార్,పై ల శ్రీనువాసరావుల ఆధ్వర్యంలో అంబలం పూజను చేపట్టారు. స్వామివారి అలంకరణ, కలశపూజ, నామసంకీర్తన పడిపూజ, అభిషేకం, అష్టోత్తర కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అరటి డొప్పలతో ఏర్పాటు చేసిన అయ్యప్పస్వామి ఆలయం, మెట్ల మార్గం నమూనా భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.`పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పూజానంతరం ప్రసాదాల వితరణ కార్యక్రమం చేపట్టారు.

## శిశువుల ఆరోగ్య సంరక్షణపై అవగాహన అవసరం


శిశువుల రక్షణపై తల్లులకు సూచనలిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి

**చింతూరు:** నవజాత శిశువుల సంరక్షణ ఎంతో ముఖ్యమని ప్రతి తల్లిదండ్రులు దీనిపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.వి.కోటిరెడ్డి అన్నారు. నవజాత శిశువు సంరక్షణ వారోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక ఏరియా ఆస్పత్రిలో తల్లులకు శిశువుల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటిరెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల ఆరోగ్యం గురించి సమగ్ర సమాచారం తెలుసుకుని దానికనుగుణంగా పోషకాహారం, వైద్యం అందించాలని సూచించారు. చిన్న పిల్లల వైద్య నిపుణులు హర్ష మాట్లాడుతూ శిశువులకు అనారోగ్యం అనిపిస్తే వెంటనే సమీప ఆస్పత్రులకు తీసుకెళ్లాలని, దీనివలన వారికి సత్వర వైద్యం అందే అవకాశముంటుందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తీసుకురావడం వలన మరణాలు సంభవించే అవకాశముందని శిశువులను రక్షించుకునేందుకు త్వరితగతిన వైద్యం అందిచాల్సిన అవసరముంటుందన్నారు. గైనకాలజిస్ట్ డాక్టర్ శశికళాదేవి, డాక్టర్ ధర్మతేజ, ఎస్ఎన్‌సీయూ సిబ్బంది పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు సక్రమంగా అమలుచేయాలి


మాట్లాడుతున్న సర్పంచ్ మోస్య

**అనంతగిరి(అరకులోయ రూరల్):** మండలంలోని టోకూరు పంచాయతీలో నేచర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ కిల్లో మోస్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను సక్రమంగా అమలుచేయాలన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలుచేసిన పథకాలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం రద్దు చేయడం దారుణమన్నారు. అధికారం చేపట్టి ఐదు నెలలు గడుస్తున్నా కూటమి ప్రభుత్వం నేటి వరకు ఒక్క పథకం అమలు చేయలేదన్నారు. అందరి భాగస్వామ్యంతోనే ప్రజా సమస్యల పరిష్కారం సాధ్యమన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నేచర్ స్వచ్ఛంద తీసుకొంటున్న చొరవ అభినందనీయమన్నారు. అనంతరం టోకూరు పంచాయతీలో నెలకొన్న సమస్యలపై వినతిపత్రాన్ని గ్రామసచివాలయ సిబ్బందికి నేచర్ సంస్థ ప్రతినిధులు అందజేశారు. పంచాయతీ కార్యదర్శి లావణ్య, నేచర్ సంస్థ కో–ఆర్డినేటర్ గౌరిపట్నాయక్, నేచర్ సిబ్బంది రాంబాబు, చందర్‌రావు, ప్రసాద్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు


అరకులో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ శారద

**డుంబ్రిగుడ:** మండలంలోని మేజర్ పంచాయతీ అరకులోని 5, 6 వార్డుల్లో తరచూ లోఓల్టేజీ తదితర తలెత్తుతున్న విద్యుత్ సమస్యను సర్పంచ్ జి.శారద ఇటీవల విద్యుత్ శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై విద్యుత్ శాఖాధికారులు స్పందించారు. ఈ మేరకు అరకులో గురువారం త్రీ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ అమర్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ శారద మాట్లాడుతూ మండలంలోనే అధిక జనాభా గల అరకు మేజర్ పంచాయతీలో విద్యుత్ సమస్యపై మండల అధికారులతో చర్చించామన్నారు. దీంతో అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేయడం హర్షణీయమన్నారు. దీనిపై గ్రామస్తుల తరపున అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

### ఆశ్రమ పాఠశాలల్లో సమస్యలపై ఆందోళన



పెదబయలులో ఆందోళన చేస్తున్న విద్యార్థులు, ఎస్ఎఫ్‌ఐ నేతలు

**పెదబయలు:** గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గురువారం మండల కేంద్రంలో ఎస్ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళనకు దిగారు. జెడ్పీ పాఠశాల నుంచి ర్యాలీగా మూడు రోడ్ల కూడలి వరకు వెళ్లి మానవహారంగా ఏర్పడి సమస్య పరిష్కరించాలంటూ పలు నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యలయం ఎదుట బైఠాయించి, ధర్నా చేశారు. మండలంలోని అసంపూర్తిగా ఉన్న జెడ్పీ పాఠశాలల భవనాలను పూర్తి చేయాలని, శీతాకాలంలో విద్యార్థులకు స్వెట్టర్లు, రగ్గులు పంపిణీ చేయాలని, విద్యార్థుల మృతిపై విచారణ నిర్వహించాలని, విద్యా రంగంలో సమస్యల పరిష్కారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలని ఎస్ఎఫ్‌ఐ నేతలు డిమాండ్ చేశారు. 900 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన


కోనలోవలో పామాయిల్ సాగుపై మాట్లాడుతున్న ప్రకాశ్

**అడ్డతీగల:** మండలంలోని కోనలోవలో రైతులకు గురువారం ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంతజలి సంస్థ డీజీఎం ఎ.ఎస్.ప్రకాష్ మాట్లాడుతూ పామాయిల్ పంట సాగుపై ఆసక్తి ఉన్న రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వ సహకారంతో రైతులకు ఉచితంగా మొక్కలు అందిస్తున్నట్టు చెప్పారు. ఇప్పటికే పామాయిల్ సాగు చేస్తున్న రైతులకు తోటల పెంపకంలో సరైన డ్రిప్ విధానాన్ని పాటించాలన్నారు. డ్రిప్ ద్వారా ఎరువులు, నీటి యాజమాన్యం, చీడపీడల నివారణ, సరైన సమయంలో ఎరువులు వేయడం తదితర పద్ధతులను వివరించారు. ఆయా పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించాలన్నారు. పతంజలి క్లస్టర్ ఆఫీసర్ చక్రబాబు, ఫీల్డ్ ఆఫీసర్ రాంబాబు, ఫీల్డ్ సూపర్‌వైజర్లు కొండలరావు, దుర్గాప్రసాద్, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి


బహుమతులిస్తున్న అడిషినల్ ఎస్‌ఐ రాంబాబు, ఎంఈవో మల్లేశ్వరరావు తదితరులు

**గంగవరం:** మండలంలో కొత్తాడ(టేకులవీధి) గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను అడిషనల్ ఎస్‌ఐ ఎస్‌ఐ రాంబాబు గురువారం సందర్శించారు.విద్యార్థులకు కేరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి మంచి పౌరులుగా సమాజానికి సేవలందించాలన్నారు. ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం బి.నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌ఐ రాంబాబు, ఎంఈఓ మల్లేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. అడిషినల్ ఎస్‌ఐ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి మంచి క్రమశిక్షణ అలవాటు చేసుకోవాలన్నారు. దురాలవాట్లుకు, డ్రగ్స్ వంటికి దూరంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ మల్లేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల లక్ష్యాన్ని నిర్ణయించుకొని ఆ లక్ష్యసాధనకు పాటుపడాలన్నారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో పాఠశాలల్లో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. ఏఎస్‌ఐలు రజాక్, సూర్యనారాయణ, హెచ్‌సీ పండరీనాథ్, పీసీ శ్రీను, సిబ్బంది నాగమణి, ఆదయ్య, పద్మావతి, రాజేష్, కుమార్, సునీత తదితరులు పాల్గొన్నారు.

## సర్వే సత్వరమే పూర్తి చేయాలి


చింతపల్లి సచివాలయంలో సిబ్బందికి సూచనలిస్తున్న డీఎల్‌పీవో కుమార్


కొత్తాడలో సర్వేను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో రాఘవన్

**చింతపల్లి:** పంచాయతీల వివరాల నమోదును వేగవంతం చేయాలని డివిజన్ పంచాయతీ అధికారి కుమార్ అన్నారు. ఎంపీడీవో శ్రీనువాసరావుతో కలసి చింతపల్లి గ్రామ సచివాలయాన్ని ఆయన గురువారం సందర్శించారు. సచివాలయంలో స్వర్ణ పంచాయతీ డేటా నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు.ఎన్‌పీసీఐ బ్యాంకు లింకేజి, హౌస్ హోల్డ్ జియో టాగింగ్ త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సచివాలయ సిబ్బందికి సూచనలిచ్చారు. అనంతరం చౌడుపల్లి–2 సచివాలయంలో ఆధార్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆధార్ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

**గంగవరం:** మండలంలోని నెల్లిపూడి, కొత్తాడ, గంగవరం గ్రామపంచాయతీలను రంపచోడవరం డివిజన్ డీఎల్‌పీవో రాఘవన్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. గ్రామాల్లో అమలు జరుగుతున్న స్వర్ణ పంచాయతీ సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేను సత్వరమే పూర్తిచేయాలని సిబ్బందికి ఆదేశించారు. ఎక్కడా జాప్యం లేకుండా సర్వే సక్రమంగా నిర్వహించి ఆన్‌లైన్ పంచాయతీ కార్యదర్శులు వెంకట్, అజయ్, కృష్ణస్వామి తదితరులున్నారు.

### వాణిజ్య పంటలతో ఆర్థికాభివృద్ధి


అంటబొంగులో రైతులతో అధికారులు

**ముంచంగిపుట్టు:** వాణిజ్య పంటలతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని ఏవో ఎం.శ్రీనివాసబాబు అన్నారు. మండలంలోని బరడ పంచాయతీ అంటబొంగు గ్రామంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయంలో పాటించాల్సిన పద్ధతులు, దిగుబడి కోసం తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో శ్రీనివాసబాబు మాట్లాడుతూ గిరిజనులు పండించే వరి, రాగులు, సామలు పంటల ఉత్పత్తులకు ప్రాసెసింగ్ చేసి, విలువ జోడించి అధిక లాభాలు పొందాలని, అంతర్జాతీయ మార్కెట్‌లను చెరగలిగితే అధిక లాభాలు వస్తాయన్నారు. ముఖ్యంగా దళారులకు పంటలు అమ్మి నష్టాలకు గురికావద్దని ఆయన రైతులను కోరారు. సర్పంచ్ పార్వతమ్మ, ఎంపీటీసీ నబ్బో, ఎంపీఈవో లోకేష్,పశు వైద్య సహాయకులు అప్పలరాజు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అద్దు, వెంకటరావు ,కాఫీ లైజన్ వర్కర్ శంకర్ రైతులు తదితరులు పాల్గొన్నారు.